గ్రీన్‌కార్డ్ బ్యాక్‌లాగ్‌కు చెల్లు!

అమెరికా చట్టసభలో బిల్లు ఆమోదం పొందితే ఇండియన్ అమెరికన్లకు లబ్ధి

వాషింగ్టన్, డిసెంబర్ 5: అమెరికాలో నివసిస్తూ సుదీర్ఘకాలంగా లక్షలాది మంది ఎదురుచూస్తున్న కీలక బిల్లు ఒకటి అమెరికా చట్టసభ ముందుకు వచ్చింది. కాంగ్రెస్ సభ్యుడు రిచ్ మెక్‌కోర్మిక్‌తో కలిసి ఇండియన్ అమెరికన్ కాంగ్రెస్ సభ్యులైన రాజా కృష్ణమూర్తి, ప్రమీలా జయపాల్ గ్రీన్‌కార్డ్ బ్యాక్‌లాగ్‌ను తగ్గించే బిల్లును సోమవారం ప్రవేశపెట్టారు. ఈ బిల్లుకు ఆమోదం లభిస్తే వేలాదిమంది ఇండియన్ అమెరికన్లకు ప్రయోజనం కలుగుతుంది. అమెరికాలో శాశ్వత నివాసానికి వీలు కల్పించే గ్రీన్ కార్డు కోసం వీరంతా దశాబ్దాల తరబడి కండ్లు కాయలు కాసేలా ఎదురుచూస్తున్నారు. ఈ బిల్లు ఉపాధి ఆధారిత వలస వీసాలపై ప్రస్తుతం ఉన్న 7 శాతం పరిమితిని తొలగిస్తుంది. ఏటా జారీ చేసే గ్రీన్‌కార్డుల్లో ఒక్కో దేశానికి ఏడు శాతానికి మించి జారీ చేసేందుకు వీలులేకపోవడంతో లక్షలాదిమంది వర్క్ వీసాదారులు ఏండ్ల తరబడి గ్రీన్‌కార్డు కోసం ఎదురుచూడాల్సి వస్తున్నది. ఈ బిల్లు ఆమోదం పొందితే ఒక్కో దేశానికి ఇచ్చే వాటా 7 నుంచి 15 శాతానికి పెరుగుతుంది. ఈ సందర్భంగా రాజా కృష్ణమూర్తి మాట్లాడుతూ.. భవిష్యత్తు ఆర్థిక వ్యవస్థను నిర్మించేందుకు కృషిచేస్తున్నప్పుడు అధిక నైపుణ్యం కలిగిన కార్మికులను గ్రీన్‌కార్డు బ్యాక్‌లాగ్‌లో కొట్టుమిట్టాడేలా చేయడం సరికాదని, అమెరికన్లుగా పూర్తిగా మారలేక దేశానికి పూర్తిగా సహకారం అందించలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బిల్లు తేవడంలో భాగమైనందుకు గర్విస్తున్నట్టు చెప్పారు.



భూమిని చల్లబరిచే ఖనిజం గుర్తింపు

న్యూయార్క్: గ్రీన్‌హౌస్ ఎఫెక్ట్ ఇప్పుడు ప్రపంచం ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య. అయితే దీనికి చెక్‌పెట్టే ఓ ఖనిజాన్ని అమెరికా పరిశోధకులు కనుగొన్నారు. సముద్రగర్భంలో ఉత్పత్తి అయ్యే స్కెక్టైట్ ఖనిజానికి భూమిని చల్లబరిచే శక్తి ఉన్నదని గుర్తించారు. ఇది గ్రీన్‌హౌస్ ఎఫెక్ట్‌కు కారణమవుతున్న కార్బన్‌ను సంగ్రహించి నిల్వచేసుకొనే అద్భుతమైన సామర్థ్యాన్ని కలిగి ఉంటుందని తేల్చారు. భూగ్రహాన్ని చల్లబర్చడంలో ఇది ముఖ్యమైన పాత్ర పోషిస్తుందని కనుగొన్నారు.

బ్రిటన్‌లో ఉపాధి వీసా నిబంధనలు కఠినతరం

వలసలను అడ్డుకోవడమే లక్ష్యం.. భారతీయులపై అధిక ప్రభావం

లండన్: బ్రిటన్‌లో పెరుగుతున్న వలసలను అడ్డుకునేందుకు రిషి సునాక్ ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకున్నది. ఇకపై అత్యధిక వేతనాలున్న విదేశీ వృత్తి నిపుణులకు మాత్రమే ఉపాధి వీసాలు జారీచేయాలని, డిపెండెంట్లుగా వచ్చే భాగస్వాములకు కఠిన నిబంధనలను అమలు చేయాలని నిశ్చయించింది. అందులో భాగంగా వర్క్ వీసా దరఖాస్తుదారుకు గతంలో 26 వేల పౌండ్లుగా నిర్దేశించిన కనీస వేతన పరిమితిని 38,700 పౌండ్లకు పెంచింది. ఇందుకు సంబంధించిన బిల్లును హోం శాఖ మంత్రి క్లెవర్లీ సోమవారం పార్లమెంట్ దిగువ సభలో ప్రవేశపెట్టారు. ఈ బిల్లు ఆమోదం పొందితే దాదాపు 3 లక్షల మంది విదేశీయులపై, ఎక్కువగా భారతీయులపై ప్రభావం పడుతుంది. ఆరోగ్య, సామాజిక సంరక్షణ వీసాలతో బ్రిటన్‌కు వెళ్లేవారిని అధిక వేతన పరిమితి నుంచి మినహాయించనున్నారు.

పీఎం-కిసాన్ సాయాన్ని పెంచే ఉద్దేశం లేదు

కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి నరేంద్ర సింగ్ తోమర్

న్యూఢిల్లీ, డిసెంబర్ 5: ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి (పీఎం-కిసాన్) కింద ప్రస్తుతం ఏడాదికి అందజేస్తున్న 6 వేల రూపాయల సహాయాన్ని పెంచే యోచన ప్రభుత్వానికి లేదని కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి నరేంద్ర సింగ్ తోమర్ మంగళవారం లోక్‌సభలో స్పష్టం చేశారు. 'ప్రస్తుతానికైతే 6 వేల సహాయాన్ని పెంచే ప్రతిపాదనేదీ ప్రభుత్వం వద్ద లేదు' అని ఆయన పేర్కొన్నారు. పీఎం-కిసాన్ పథకం కింద రైతుల వ్యవసాయ ఖర్చులకు ఏడాదికి ఈ మొత్తాన్ని 2018 డిసెంబర్ నుంచి కేంద్రం అందజేస్తున్నది. ఈ సహాయాన్ని నాలుగు నెలలకొకసారి నేరుగా రైతుల ఖాతాల్లో 2 వేల వంతున జమ చేస్తున్నది.

2019-21 మధ్య 35వేలకు పైగా విద్యార్థుల ఆత్మహత్య

న్యూఢిల్లీ, డిసెంబర్ 5: దేశంలో 2019 నుంచి 2021 వరకు ప్రతి ఏడాది విద్యార్థుల ఆత్మహత్యలు పెరుగుతూ వస్తున్నాయని, ఈ మూడేండ్లలో 35 వేల మందికిపైగా విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారని కేంద్ర సామాజిక న్యాయం, సాధికారిత శాఖ మంత్రి అబ్బయ్య నారాయణ స్వామి లోక్‌సభలో వెల్లడించారు. సామాజిక వివక్ష కారణంగా దేశంలో ఎంతమంది ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకున్నారు? అన్న ప్రశ్నకు ఆయన సమాధానమిస్తూ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల ఆత్మహత్యల గురించి ప్రత్యేక వివరాలు లేవని చెప్పారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులపై వివక్ష, వేధింపుల నివారణకు దేశవ్యాప్తంగా ఉన్న విద్యా సంస్థల్లో ఎస్సీ, ఎస్టీ స్టూడెంట్ సెల్స్, గ్రీవెన్స్ సెల్స్, గ్రీవెన్స్ కమిటీలను నియమించినట్టు చెప్పారు.

విద్యార్థుల ఆత్మహత్యలు	
2019	10,335
2020	12,526
2021	13,089

'ఇండియా' భేటీ వాయిదా

- కాంగ్రెస్ నాయకత్వం పట్ల కూటమి పార్టీల్లో విముఖత
- ఈ నెల మూడో వారానికి వాయిదా పడ్డ సమావేశం



(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, డిసెంబర్ 5 (నమస్తే తెలంగాణ): సార్వత్రిక ఎన్నికలకు సెమీ ఫైనల్స్‌గా భావించిన ఐదు రాష్ట్రాల ఫలితాలతో 'ఇండియా' కూటమి మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. ఈ కూటమికి పెద్దన్నపాత్ర పోషిస్తున్న కాంగ్రెస్, ఉత్తరాదిలో నాలుగు రాష్ట్రాలలో ఘోర పరాజయం పాలుకావడం దీనిపై ప్రభావం చూపింది. ఫలితంగా ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ఇంట్లో బుధవారం జరగాల్సిన కూటమి భేటీ వాయిదా పడింది. ఈ సమావేశానికి హాజరు కావడానికి కూటమిలోని పార్టీలు పెద్దగా ఆసక్తి కనబర్చకపోగా వివిధ కారణాల దృష్ట్యా తాము హాజరు కాలేమని సమాచారం పంపించాయి. దీంతో కూటమి భేటీని ఈ నెల మూడో వారానికి వాయిదా వేసినట్టు కాంగ్రెస్ ప్రకటించింది.

ఉత్తరాదిలో కాంగ్రెస్ పరాజయమే కారణమా?

జాతీయ స్థాయిలో కాంగ్రెస్ గ్రాఫ్ రోజురోజుకూ పడిపోతుండటంతో ఆ పార్టీ నాయకత్వంలోని ఇండియా కూటమితో కలిసి నడవడానికి విపక్షాలు ఆసక్తి కనబర్చడం లేదని రాజకీయ పరిశీలకులు అంటున్నారు. అయితే అలాంటిదేమీ లేదని కాంగ్రెస్ నమ్మించే ప్రయత్నం చేస్తున్నది. వివిధ కారణాల వల్ల కూటమి నేతలు ఈ భేటీకి హాజరు కావడం లేదని సమాచారం ఇవ్వడంతో వారిని సంప్రదించి ఈ నెల 27 లేక 28న భేటీ కానున్నట్టు కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. అయితే తుఫాను బీభత్సం వల్ల రాలేనని డీఎంకే అధినేత, తమిళనాడు సీఎం స్టాలిన్ చెప్పిన కారణం ఒక్కటే విపక్ష నేతలు చెప్పిన కారణాల్లో నమ్మశక్యంగా ఉన్నట్టు సమాచారం. మధ్యప్రదేశ్ ఎన్నికల్లో కాంగ్రెస్-సమాజ్‌వాదీ పార్టీల మధ్య సీట్ల పంపకాల విషయంలో విభేదాలు తలెత్తిన నేపథ్యంలో సమాజ్‌వాదీ అధినేత అఖిలేశ్ యాదవ్ భేటీకి హాజరు కావడానికి ఆసక్తి కనబర్చడం లేదని ఆ పార్టీ వర్గాల సమాచారం. అయితే ఇటీవల జరిగిన అయిదు రాష్ట్రాల ఎన్నికల కారణంగా కూటమి సమావేశాన్ని నిర్వహించలేకపోయినట్టు కాంగ్రెస్ చెప్తున్నది. ఈ ఐదు రాష్ట్రాలో విజయం సాధించి కూటమిపై పెత్తనం చెలాయించాలని కాంగ్రెస్ పార్టీ భావించింది. అయితే ఆ పార్టీ అంచనాలు తలకిందులు కావడంతో కూటమి సమావేశానికి హాజరు కావడానికి వివిధ పార్టీల నేతలు ఎవరూ పెద్దగా ఆసక్తి చూపడం లేదని రాజకీయ వర్గాలో చర్చ జరుగుతున్నది.

ఈవీఎంల వల్లే ఓడాం!

- చిప్ ఉన్న ఏ మెషీన్‌ను అయినా హ్యాక్ చేయొచ్చు
- కౌంటింగ్‌కు ముందే ఫలితం ఎలా తెలిసింది?
- మధ్యప్రదేశ్ కాంగ్రెస్ నేత దిగ్విజయ్ వ్యాఖ్యలు
- సొంత గ్రామాల్లో 50 ఓట్లు కూడా రాలేదని కొంత మంది ఎమ్మెల్యేలు చెబుతున్నారు..
- ఇదెలా సాధ్యం?: మాజీ సీఎం కమల్‌నాథ్

భోపాల్, డిసెంబర్ 5: మూడు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ పరాజయం పాలైన నేపథ్యంలో మధ్యప్రదేశ్‌కు చెందిన ఆ పార్టీ సీనియర్ నేతలు ఈవీఎంల విశ్వసనీయతపై ప్రశ్నలు లేవనెత్తారు. చిప్ ఉండే ఏ మెషీన్‌ను అయినా హ్యాక్ చేయొచ్చని మాజీ సీఎం, రాజ్యసభ ఎంపీ దిగ్విజయ్ సింగ్ అన్నారు. ఈవీఎంల ద్వారా ఓటింగ్ జరుపడాన్ని తాను 2003 నుంచి వ్యతిరేకిస్తున్నానని ఆయన పేర్కొన్నారు. 'భారత ప్రజాస్వామ్యాన్ని హ్యాకర్లు నియంత్రించడాన్ని మనం అనుమతిద్దామా? ఈ ప్రాథమిక ప్రశ్నను అన్ని రాజకీయ పార్టీలు అడగాలి. కేంద్ర ఎన్నికల సంఘం, సుప్రీంకోర్టు దయచేసి మన భారత ప్రజాస్వామ్యాన్ని కాపాడండి' అంటూ మంగళవారం ఎక్స్‌లో పోస్టు చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ విజయం వెనుక ఈవీఎంల హ్యాకింగ్ ఉన్నదని ఆరోపణలు చేసిన దిగ్విజయ్.. ఎన్నికల్లో అక్రమాలు జరిగాయన్న తన ఆరోపణలను నొక్కిచెబుతూ ఎక్స్‌లో మరో పోస్టు పెట్టారు. కౌంటింగ్‌కు ముందే ఖజ్రోడ్ అసెంబ్లీ నియోజకవర్గ ఫలితాలు ఓ బీజేపీ నేతకు ముందే ఎలా తెలుసునని ప్రశ్నించారు. ఈ మేరకు ఆయన అనిల్ ఛజేడ్ అనే వ్యక్తి ఫేస్‌బుక్ ఖాతా పోస్టు, ఎన్నికల కమిషన్ వెబ్‌సైట్ ఫలితాల పేజీకి చెందిన రెండు స్క్రీన్‌షాట్లను షేర్ చేశారు. ఫలితాలకు రెండు రోజుల ముందు అనిల్ ఛజేడ్ అనే వ్యక్తి చెప్పినట్టు అభ్యర్థులకు వచ్చే ఓట్ల వివరాలు, కౌంటింగ్ తర్వాత ఫలితాల్లో వచ్చిన ఓట్లు దాదాపు ఒకేలా ఉన్నాయని అన్నారు.



భోపాల్‌లో జరిగిన పార్టీ నేతల సమీక్ష సమావేశంలో పాల్గొన్న కమల్‌నాథ్, దిగ్విజయ్

బీజేపీ అభ్యర్థికి 93 వేలు, కాంగ్రెస్ అభ్యర్థికి 77 వేలు వస్తాయని డిసెంబర్ 1న పోస్టులో ఛజేడ్ తన పోస్టులో రాయగా.. 3న విడుదలైన ఫలితాల్లో బీజేపీకి 93,552, కాంగ్రెస్‌కు 77,625 ఓట్లు రావడం గమనార్హం. అయితే ఈ ఆరోపణలను బీజేపీ ఎమ్మెల్యే రామేశ్వర్ ఖర్మ కొట్టిపారేశారు. ఆయన ఈవీఎంలను నమ్మరని, ఆఖరుకు తనను తాను కూడా నమ్మరని ఎద్దేవా చేశారు. కాగా, అనిల్ ఛజేడ్‌కు పార్టీతో సంబంధం ఉన్నట్టు గానీ, లేనట్టు గానీ బీజేపీ స్పందించలేదు.

ఓటమిని కప్పిపుచ్చుకొనేందుకే: బీజేపీ

కాంగ్రెస్ నేతల వ్యాఖ్యలకు బీజేపీ కౌంటర్ ఇచ్చింది. ఎన్నికల్లో గెలవలేనప్పుడల్లా ఈవీఎంలపై నిందలు వేయడం ప్రతిపక్షానికి అలవాటుగా మారిందని కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్ విమర్శించారు. 'గెలిస్తే, వారికి ఈవీఎంలు మంచివి. అదే ఓడిపోతే, వాటిపైనే నిందలు వేస్తారు' అని పేర్కొన్నారు.

ఫలితాలు ఆశ్చర్యానికి గురిచేశాయ్..

మధ్యప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు తనను ఆశ్చర్యానికి గురిచేశాయని మరో సీనియర్ నేత, మాజీ సీఎం కమల్‌నాథ్ పేర్కొన్నారు. ఈవీఎంల హ్యాకింగ్ జరిగిందంటూ కొంత మంది మాజీ ఎమ్మెల్యేలు చేస్తున్న అరోపణలపై మీడియా అడిగిన ప్రశ్నకు ఆయన స్పందిస్తూ.. రాష్ట్రంలో పబ్లిక్ మూడ్ కాంగ్రెస్‌కు అనుకూలంగా ఉన్నదని, అయితే వచ్చిన ఫలితాలను చూస్తే ఆశ్చర్యం వేస్తుందన్నారు. 'తమ గ్రామాల్లో కనీసం 50 ఓట్లు కూడా రాలేదని కొంతమంది నేతలు చెబుతున్నారు. ఇదెలా సాధ్యం?' అని అన్నారు.

గోమూత్ర రాష్ట్రాల్లోనే బీజేపీ గెలుపు

డీఎంకే ఎంపీ వ్యాఖ్యలపై వివాదం

న్యూఢిల్లీ, డిసెంబర్ 5: డీఎంకే ఎంపీ సెంథిల్‌కుమార్ బుధవారం లోక్‌సభలో వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. హిందీ మాట్లాడే ప్రాంతాలన్నీ 'గోమూత్ర రాష్ట్రాలు' అని, బీజేపీ అక్కడ మాత్రమే విజయం సాధిస్తుందని వ్యాఖ్యానించారు. దక్షిణాది రాష్ట్రాల్లో ఆ పార్టీ గెలవలేదని అన్నారు. దీనిపై బీజేపీ అభ్యంతరం వ్యక్తం చేసింది. తన వ్యాఖ్యలపై విమర్శలు రావడంతో సెంథిల్ కుమార్ క్షమాపణలు చెప్పారు.

హజ్ యాత్రకు దరఖాస్తుల ఆహ్వానం

శ్రీనగర్: హజ్ యాత్ర -2024కు ఆన్‌లైన్ దరఖాస్తులను భారత హజ్ కమిటీ ఆహ్వానించింది. ఈ నెల 4 నుంచి దరఖాస్తులు అందుబాటులో ఉంచామని, వాటిని సమర్పించేందుకు తుది గడువు ఈ నెల 20 అని తెలిపింది. www.hajcommittee.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించి, హజ్ విధానాన్ని తెలుసుకోవాలని వివరించింది. దరఖాస్తుదారుల వద్ద మెషిన్ రీడబుల్ ఇంటర్నేషనల్ పాస్‌పోర్టు ఉండాలని..అది ఈ నెల 20న లేదా అంతకు ముందు జారీ చేసినది అయి ఉండాలని, 2025 జనవరి 31 వరకు చెల్లుబాటయ్యేది అయి ఉండాలని తెలిపింది.

సరగసీ చట్టంపై కేంద్రానికి సుప్రీం కోర్టు నోటీసు

న్యూఢిల్లీ: పెండ్లి కాని మహిళ సరగసీ ద్వారా బిడ్డను పొందడాన్ని నిషేధిస్తున్న నిబంధనపై విచారణ జరిపేందుకు సుప్రీంకోర్టు మంగళవారం అంగీకరించింది. ప్రస్తుత సరగసీ చట్టంలోని నిబంధనలు రాజ్యాంగంలోని అధికరణలు 14, 21లను ఉల్లంఘిస్తున్నాయని పిటిషనర్ నేహా నాగ్‌పాల్ ఆరోపించారు. తన వ్యక్తిగత జీవితంలో ప్రభుత్వం జోక్యం లేకుండా మాతృత్వాన్ని అనుభవించాలనుకుంటున్నానని తెలిపారు. తాను 40 ఏండ్ల మధుమేహ రోగినని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం తరపున అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్య భాటి వాదనలు వినిపిస్తూ, ఈ అంశంపై విస్తృత ధర్మాసనం విచారణ జరుపుతున్నదన్నారు. పిటిషనర్ తరపున న్యాయవాది సౌరభ్ కిర్పాల్ మాట్లాడుతూ, ఈ అంశంలో విస్తృత రాజ్యాంగ ప్రశ్న ఇమిడి ఉందని, దీనిపై విచారణ జరపాలని అన్నారు. దీంతో ధర్మాసనం కేంద్ర ప్రభుత్వానికి నోటీసు ఇచ్చింది.

కర్ణిసేన అధ్యక్షుడి హత్య

- జైపూర్‌లోని నివాసంలో కాల్చి చంపిన దుండగులు
- తమ పనేనన్న బిష్ణోయ్ గ్యాంగ్

సుఖ్‌దేవ్‌పై కాల్పులు జరుపుతున్న దుండగులు, ఇన్‌సెట్‌లో సుఖ్‌దేవ్

జైపూర్, డిసెంబర్ 5: రాష్ట్రీయ రాజ్‌పుత్ కర్ణిసేన అధ్యక్షుడు సుఖ్‌దేవ్ సింగ్ గోగామెడీని గుర్తుతెలియని దుండగులు కాల్చిచంపారు. మంగళవారం మధ్యాహ్నం రాజస్థాన్ జైపూర్‌లోని శ్యామ్‌నగర్ ప్రాంతంలో ఉన్న సుఖ్‌దేవ్ ఇంట్లోకి చొరబడిన ముగ్గురు దుండగులు ఈ ఘాతుకానికి పాల్పడినట్టు పోలీసులు వెల్లడించారు. 'సుఖ్‌దేవ్‌తో మాట్లాడేపని ఉందని ముగ్గురు దుండగులు ఆయన ఇంటికి వచ్చారు. సుఖ్‌దేవ్ సోఫాలో కూర్చొని మాట్లాడుతూ ఉండగా.. దుండగులు అత్యంత సమీపం నుంచి కాల్పులు జరిపారు. సుఖ్‌దేవ్ గన్‌మెన్‌పై, అక్కడున్న మరో వ్యక్తిపైనా కాల్పులకు తెగబడ్డారు. ఈ ఘటనలో వారిద్దరూ తీవ్రంగా గాయపడ్డారు' అని రాజస్థాన్ డీజీపీ ఉమేశ్ మిశ్రా విలేకరులకు తెలిపారు. తీవ్రంగా గాయపడ్డ సుఖ్‌దేవ్‌ను దవాఖానకు తరలిస్తుండగా మార్గమధ్యలోనే ప్రాణాలు కోల్పోయారని చెప్పారు. కాల్పుల ఘటన సీసీటీవీ కెమెరాలో రికార్డయ్యింది. సుఖ్‌దేవ్ అనుచరులు జరిపిన కాల్పుల్లో దుండగుల్లో ఒకడు చనిపోయాడు. మిగతా ఇద్దరు దుండగులు పారిపోగా, వారిని పట్టుకునేందుకు పోలీసులు రంగంలోకి దిగారు.

జైపూర్‌లో ఉద్రిక్తత

ఈ ఘటనతో జైపూర్‌లో తీవ్ర ఉద్రిక్తత నెలకొన్నది. రాజ్‌పుత్ సామాజికవర్గానికి చెందిన పలువురు ప్రముఖులు దవాఖానకు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్‌కు చెందిన సంపత్ నెహ్రా నుంచి తనకు బెదిరింపు కాల్స్ వస్తున్నాయని సుఖ్‌దేవ్ సింగ్ గతంలో పలుమార్లు పోలీసులకు ఫిర్యాదు చేశారని, దీనిని పోలీసులు పట్టించుకోలేదని సుఖ్‌దేవ్ మద్దతుదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సీసీటీవీ ఫుటేజ్‌ను పోలీసులు పరిశీలిస్తున్నారు. రాష్ట్రీయ కర్ణిసేనతో సుఖ్‌దేవ్ సింగ్‌కు చాలాకాలంగా అనుబంధముంది. అయితే ఆ సంస్థతో కొంతకాలంగా ఏర్పడ్డ విభేదాల కారణంగా రాష్ట్రీయ రాజ్‌పుత్ కర్ణిసేన పేరుతో మరో సంస్థను ఏర్పాటు చేసుకున్నారు. బాలీవుడ్ చిత్రాలు పద్మావత్, గ్యాంగ్‌స్టర్ ఆనంద్ పాల్ ఎన్‌కౌంటర్ కేసు తర్వాత రాజస్థాన్‌లో జరిగిన పలు ధర్నాలతో సుఖ్‌దేవ్ వార్తల్లో నిలిచారు.

దేశంలో రోజుకు 294 కిడ్నాప్ కేసులు

న్యూఢిల్లీ: దేశంలో 2022లో రోజుకు సగటున 294 కిడ్నాప్ కేసులు నమోదైనట్లు నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో (ఎన్‌సీఆర్‌బీ) వార్షిక నివేదిక తెలిపింది. దేశవ్యాప్తంగా 1,07,588 కిడ్నాప్, అపహరణ కేసులు నమోదైనట్లు, అత్యధికంగా ఉత్తరప్రదేశ్‌లో ఈ దారుణాలు జరిగినట్లు తెలిపింది. 2022లో అపహరణకు గురైనవారిలో 1,16,109 మందిని సజీవంగా కాపాడగలిగినట్లు, 974 మంది మృతదేహాలను కనుగొన్నట్లు తెలిపింది.

అత్యధిక కిడ్నాప్ కేసులు నమోదైన రాష్ట్రాలు

ఉత్తరప్రదేశ్	16,262
మహారాష్ట్ర	12,260
బీహార్	11,822
మధ్యప్రదేశ్	10,409
పశ్చిమబెంగాల్	8,088

సియాచిన్‌లో విజయ సంకేతం చూపిస్తున్న గీతిక (వృత్తంలోని వ్యక్తి)

సియాచిన్‌లో తొలి మహిళా ఆర్మీ అధికారిగా గీతిక కౌల్

న్యూఢిల్లీ, డిసెంబర్ 5: సైన్యానికి చెందిన కెప్టెన్ గీతిక కౌల్ చరిత్ర సృష్టించారు. ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన యుద్ధభూమి సియాచిన్‌లో విధులు నిర్వర్తించనున్న తొలి మహిళా మెడికల్ ఆఫీసర్‌గా నిలిచారు. పూర్తిగా మంచుతో నిండి ఉండే సియాచిన్‌లో (సముద్ర మట్టానికి దాదాపు 15,500 అడుగుల ఎత్తులో) విపరీతమైన చలి ఉంటుంది. ఇక్కడ విధులు నిర్వర్తించడమనేది సాహసంతో కూడుకున్నది. అలాంటి ప్రదేశంలో పనిచేయాలంటే శారీరకంగా, మానసికంగా చాలా దృఢంగా ఉండాలి. ఎంతో కఠోరమైన శిక్షణలో ఉత్తీర్ణత సాధించాలి. ఈ శిక్షణను గీతిక కౌల్ విజయవంతంగా పూర్తి చేశారు.

మనుషులు 200 ఏండ్లు జీవించకపోవడానికి కారణమిదేనా?

న్యూయార్క్, డిసెంబర్ 5: మనుషులు వందేండ్లే ఎందుకు జీవిస్తారు? 200 ఏండ్లు ఎందుకు జీవించరు? అనేది చాలా మంది ప్రశ్న. ఈ ప్రశ్నకు బర్మింగ్‌హామ్ వర్సిటీ పరిశోధకులు సమాధానాన్ని కనుగొన్నారు. వంద మిలియన్ ఏండ్ల కిందట డైనోసార్ల పరిణామ ఒత్తిళ్లు ఆధునిక క్షీరదాల వయసుపై చెరగని ముద్ర వేశాయని గుర్తించారు. డైనోసార్లలాంటి ప్రారంభ క్షీరదాలు నిరంతర ముప్పులో ఉండటంతో మనుగడ కోసం వేగవంతమైన పునరుత్పత్తి చేయడంతో దీర్ఘాయువు సంబంధిత జన్యునష్టం లేదా క్రియారహితం అయినట్టు తేల్చారు. పరిణామ క్రమంలో అది కొనసాగుతూ ఆధునిక క్షీరదాలపై ఈ ప్రభావం పడిందని, అందుకే మనుషులు 200 ఏండ్లు బతకడం అసాధ్యంగా మారిందని కనుగొన్నారు.

జీమెయిల్‌లో స్పామ్‌ను గుర్తించే ఏఐ వ్యవస్థ

న్యూఢిల్లీ: జీమెయిల్‌లో స్పామ్‌ను గుర్తించే విధంగా ఏఐ (కృత్రిమ మేధస్సు) ఆధారిత రక్షణ వ్యవస్థను గూగుల్ అభివృద్ధి చేసింది. ప్రత్యేకమైన అక్షరాలు, ఎమోజీలు, టైపోస్, ఇతర అక్షరాలతో, టెక్స్ట్ రూపంలోని రకరకాల ఈమెయిల్స్‌ను, స్పామ్‌ను ఇప్పుడున్న రక్షణ వ్యవస్థ అడ్డుకోలేదు. ఈ నేపథ్యంలో దీనిని అప్‌గ్రేడ్ చేస్తూ 'ఆర్ఈటీవీఈసీ' అనే ఏఐ ఆధారిత మోడల్‌ను గూగుల్ అభివృద్ధి చేసింది. స్పామ్ మెయిల్స్‌ను వర్గీకరించే విధంగా 'ఆర్ఈటీవీఈసీ' రక్షణ వ్యవస్థను తీసుకొస్తున్నది. జీమెయిల్, యూట్యూబ్, గూగుల్ ప్లేలలో హానికరమైన కంటెంట్, ఫిషింగ్ దాడులు, అనుచిత వ్యాఖ్యలు.. మొదలైన వాటిని గుర్తించేందుకు 'ఆర్ఈటీవీఈసీ' మరింత సమర్థంగా పనిచేస్తుందని కంపెనీ ఒక ప్రకటనలో పేర్కొన్నది.

నడక కంటే పరుగే మేలు

రోజూ 25 నిమిషాల పరుగుతో ఆయుష్షు పెరుగుదల



(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, డిసెంబర్ 5(నమస్తే తెలంగాణ): ఆరోగ్యంగా ఉండాలంటే రోజూ కొంత సమయం నడవాలని(వాకింగ్) డాక్టర్లు తరుచూ సూచించే విషయం అందరికీ తెలిసిందే. కానీ తాజా అధ్యయనంలో నడక కంటే రోజూ 25 నిమిషాల పాటు పరుగెడితే ఆయుష్షు పెంచుకోవచ్చని, 8 ఏండ్ల పాటు 35 శాతం మృత్యు గండం నుంచి తప్పించుకోవచ్చని తేలింది. తైవాన్‌లో 4 లక్షల మందిపై జరిపిన పరిశోధనలో రన్నింగ్ వల్ల ఆయుష్షు పెరుగుతున్నట్లు గ్రహించారు. రోజూ జాగింగ్ కాని, రన్నింగ్ కాని, వేగంగా నడవడం వల్ల కలిగే లాభాలను బేరీజు వేశారు. ఆ పరిశోధనల్లో రోజూ 25 నిమిషాలు రన్నింగ్ చేయడం లేదా 105 నిమిషాల పాటు వాకింగ్ చేయడం వల్ల ఎనిమిదేండ్ల పాటు 35 శాతం వరకు మృత్యువు నుంచి తప్పించుకోవచ్చని తేలింది. 2014లో అయోవా స్టేట్ యూనివర్సిటీ ప్రొ.డక్ చుల్ లీ నాయకత్వంలో జరిగిన అధ్యయనంలో రోజూ క్రమం తప్పకుండా నిర్ధారిత సమయం ప్రకారం సుమారు 9 కిలోమీటర్ల వేగంతో జాగింగ్ చేయడం వల్ల వాకింగ్ చేయడం కంటే 30 శాతం మెరుగైన ఫలితాలు కనిపించాయి. రన్నింగ్ వల్ల పదిహేనేండ్ల వరకు 30 శాతం మేర మరణాలను జయించవచ్చని పరిశోధకులు పేర్కొన్నారు. రన్నింగ్ చేయడం వల్ల గుండెకు ఎక్కువ మోతాదులో ఆక్సిజన్ అందడం ద్వారా ఆయుష్షు పెరిగే అవకాశాలు మెరుగుపడతాయని అధ్యయనంలో తేలింది.



భూ కక్ష్య దిశగా ప్రొపల్షన్ మాడ్యుల్

బెంగళూరు, డిసెంబర్ 5: చంద్రయాన్-3 ప్రొపల్షన్ మాడ్యుల్(పీఎం)ను చంద్రుడి కక్ష్య నుంచి భూ కక్ష్య వైపు మరల్చినట్టు ఇస్రో మంగళవారం వెల్లడించింది. చంద్రయాన్-3 మిషన్ ఉద్దేశాలను పూర్తిగా చేరుకున్నట్టు తెలిపింది. ల్యాండర్ మాడ్యుల్‌ను జియో స్టేషనరీ ట్రాన్స్‌ఫర్ ఆర్బిట్ నుంచి తుది లూనార్ పోలార్ సర్క్యులర్ ఆర్బిట్‌కు చేర్చి ల్యాండర్‌ను వేరు చేయడం ప్రొపల్షన్ మాడ్యుల్ ముఖ్య ఉద్దేశమని చెప్పింది. అనంతరం ప్రొపల్షన్ మాడ్యుల్ చంద్రుడి కక్ష్యలోనే తిరుగతూ భూమికి సమాచారం చేరవేసింది. తాజాగా ఈ మాడ్యుల్‌ను భూ కక్ష్యవైపు మళ్లించారు. ఇందులోని షేప్ పేలోడ్ భూమిపై పరిశోధనలు నిర్వహించనుంది.

టాప్ ర్యాంకింగ్స్‌లో చోటు దక్కని భారత వర్సిటీలు

QS WORLD UNIVERSITY RANKINGS

న్యూఢిల్లీ, డిసెంబర్ 5: సోమవారం వి